

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



### నెల నెలకీ కొన్ని ఖులాసా ఖులాసా కబుర్లు

## ఫోర్త్ ఎస్టేట్

**నేను ఎఫ్.డి.సీలో అంటే** 'ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' ఆఫీసులో ఉన్నాను. ఆ సంవత్సరం నంది అవార్డ్స్ జ్యూరీలో నేను మెంబర్ని. జంధ్యాలగార్ని మా ఛైర్‌మెన్‌గా వేసారు. నెలరోజులు ఆ మహానుభావుడితో కలిసి టి.వీ సీరియల్స్ ఆనందంగా వీక్షించచ్చు అని నేను మురిసిపోతుండగా, దుర్వార్త వినాల్సొచ్చింది. ఆయన స్వర్గస్థులయ్యారు. ఆ స్థానంలో ఆర్. ఆర్. కే. శ్రీ అని ఎక్స్ దూరదర్శన్ డైరెక్టర్ వచ్చారు. ఆ బ్యాచ్‌లో నాకు గుర్తున్నంత వరకూ, లక్ష్మీ దేవదాసు కనకాలా, బీరం మస్తాన్ రావ్‌గారూ, ఎమ్.వి.రఘు, ఏడిద రాజా, భవానీ శంకర్, అంకిరెడ్డిగారూ, మొదలైన సీనియర్ టెక్నీషియన్లు, టీ.వి సినిమా రంగాలకి చెందినవారు ఉన్నారు.

మేమంతా పదిగంటలకల్లా వెళ్ళి, ఒంటిగంట దాకా చూసి, లంచ్ చేసి, మళ్ళీ సాయంత్రం 5 గంటలదాకా ఒక నెలరోజుల పాటు, సంవత్సరాంతం వరకూ ప్రసారమైన టీ.వీ సీరియల్స్, (పదహారు ఎపిసోడ్లే లెండి) డాక్యుమెంటరీస్, టెలీఫిల్మ్స్, ఇంకా దూరదర్శన్‌లో మాత్రమే వచ్చే ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్ మొదలైనవి అన్నీ చూడాలి. లంచ్ కన్నా ముందు ఎఫ్.డి.సీ వాళ్ళు సర్వ్ చేసే ఉస్మానియా బిస్కట్స్, టీ మాత్రం అద్భుతంగా ఉండేవి. వాటికోసం అన్నా రోజూ వెళ్ళాలి అనిపించేది. అందరిలోకీ నేను జూనియర్నీ, చిన్నదాన్నీ కాబట్టి అల్లరి చేసేదాన్ని (కాకపోయినా చేసేదాన్ని) ఒకవేళ సీరియల్ చూస్తూ నేను కామెంట్ చెయ్యకపోతే "రమణీ రాలేదా? " అని ఎవరో ఒకరు అడిగేవారు. ముఖ్యంగా మాకు దూరదర్శన్ ప్రోగ్రామ్స్‌లో 'బోర్స్' అనే టెలీఫిల్మ్ వచ్చింది. అంటే బోర్‌బావుల తవ్వకం గురించి, అదీ మొత్తం నలభై నిమిషాల నిడివి చూడాల్సిందే, ఎంతో స్టడీ చేసి, డేటా సంపాదించి చేస్తారు ఈ న్యూస్ రీళ్ళు. మనం తేలిగ్గా వదిలెయ్యలేం. కానీ అది పేరు సార్ధకం చేసుకునే విధంగానే ఉంది.

అందులో కూడా నేను హాస్యం వెతికి ఎంజాయ్ చేసేదాన్ని. మా బీరం మస్తాన్‌రావ్‌గారు సీనియర్ ఎన్.టీ.ఆర్.తో ప్రేమ సింహాసనం, కృష్ణతో బుర్రిపాలెం బుల్లోడు, నరేష్‌తో ఊహాసుందరీ, ఇంకా చాలా సినిమాలు తీసిన దర్శకులు. చతురతలో ఆయనది అందె వేసిన చెయ్యి. ఓసారి భోజనాలప్పుడు జంధ్యాలగారి సినిమాలకి ఎక్కువగా వర్క్ చేసిన కెమెరామెన్ ఎమ్.వి.రఘుగారు 'నెమలి మాంసం అంత బాగోదు, ఎంత నమిలినా నమలబడదు' అనే అంశం మాట్లాడ్డం మొదలు పెట్టారు. అంతా విని మస్తాన్‌రావ్‌గారు "నువ్వు తిన్న నెమలి వృద్ధకన్య అయివుంటుంది" అన్నారు. ఇలా ఆయన చెణుకులు విసుర్తూ, ఎన్.టీ.ఆర్ గారి భోజనపు అలవాట్ల గురించి మాకు చెప్తూ ఉండేవారు. మిరపకాయ బజ్జీలు ఓ పాతిక ప్లేట్లో పెట్టుకుని, కారం సరిపోక, పైన ఎర్రకారం జల్లుకుని ఆయన తినేవారుట.

అంకిరెడ్డిగారు చాలా సీనియర్ ఎడిటర్, ఆయనకి నేనంటే ప్రత్యేకమైన అభిమానం. 'లీడర్' చదివి, మా అమ్మ దగ్గరకొచ్చి "నీ జన్మ ధన్యం అమ్మా. అటువంటి తండ్రీ, ఇటువంటి బిడ్డా" అన్నారు నా మీద అభిమానంతో. జ్యూరీలో అయిన పరిచయం, ఆయన

స్వర్గస్తులయ్యేదాకా, సాహిత్య పరిచయంగా మారి నేను ఏ కథ రాసినా ఫోన్ చేసి చదివానని చెప్పేవారు. అప్పట్లో పుస్తక ప్రియులు చాలామంది ఉండేవారు.

లక్ష్మీదేవి కనకాలగారు 'డిక్షన్' గురించి ఎక్కువగా మాట్లాడేవారు. వారి ఇల్లంతా ఆర్టిస్టులే. ఆవిడే స్వయంగా ఏక్టింగ్ స్కూల్ డైరెక్టర్ అయినా, పక్కా గృహిణి. ఆవిడ ఇడ్లీల్లోకి కొబ్బరి పాలు చేస్తే, రాజేంద్రప్రసాద్ వచ్చి అపురూపంగా తిని, ప్యాక్ చేయించుకుని వెళ్ళేవాడుట. చిరంజీవి కూడా ఆ ఏక్టింగ్ స్కూల్‌లో తర్ఫీదు పొందాడుట. ఆవిడ కోడలు సుమ ఎంత మంచి ఏంకరో మీకు తెలుసు.

ఇలా రకరకాల ప్రముఖులతో సరదాగా, కష్టాలల్లోనూ చిరునవ్వులు వెదజల్లుతూ, ఎంత నాసిరకం సీరియల్ అయినా, మేం జోకులు పేల్చుకుంటూ చూసేస్తూ ఉండేవాళ్ళం.

ఆ రోజు.. అలాగే అందరం పదిగంటలకి ఎఫ్.డి.సి.కి వెళ్ళాం. తారీకు సెప్టెంబర్ పదకొండు, 2001 వ సంవత్సరం. అంతా కూర్చుని టీ.వీ చూస్తూ ఉండగా అప్పటి ఎఫ్.డి.సీ డైరెక్టర్ వచ్చి 'దారుణం జరిగిపోయింది. అమెరికాలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ కూలగొట్టేసారు' అని మాములు టీ.వీ పెట్టారు.

ఆకాశాన్ని తగిలేట్లు గర్వంగా నిలబడ్డ ఆ ట్విన్ టవర్స్, విమానాలు వాటిలోంచి దూసుకెళ్తుంటే, పేకమేడల్లా, నేలరాలడం, మేం కళ్ళు అప్పగించి చూసాం. పదే పదే అదే చూపించారు. ఏడు బిల్డింగ్స్ కల ఆ వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఒసామా బిన్ లాడెన్ వ్యూహంలో నేలకూలింది. లోవర్ మన్‌హట్టన్, న్యూయార్క్‌లో ఉన్న ఈ టవర్స్‌లో ఎన్ని ఆఫీసులున్నాయో, ఎంతమంది జనం ఆ రోజు అశువులు బాసారో కానీ, ఆ బిల్డింగ్స్ నేలకూలడం తప్ప మనకి ఏమీ చూపించలేదు. ఒక్క చుక్క రక్తం, భీతావహమైన సీన్లూ లేవు.

అదే మన మీడియా అయితే? రక్తాలు కారే కళేబరాలూ, చేతులూ, కాళ్ళూ ముక్కలుగా ఊడిపోయిన మానవులనీ చూపించడమే కాదు, వాళ్ళ నోళ్ళ దగ్గర మైకులు పెట్టి "మీకెలా ఉంది? ఆ సంఘటన పట్ల ఎలా ప్రతిస్పందిస్తున్నారూ? సుమారు ఎంత మంది పోయి ఉంటారూ? మీరెంత సేపట్లో పోతానని అనుకుంటున్నారూ? " టైప్‌లో, రక్తం కారిపోతూ, అవసాన దశలో ఉన్నవాళ్ళని ఇంటర్వ్యూలు చేస్తారు. టీ.వీ పెడితే చాలు రక్తం.. శవాలు. హాహాకారాలు, ఏడుపులుతో ప్రజల్ని అన్నం తినకుండా, నీళ్ళు తాగకుండా, నిద్రపోకుండా చేసేస్తారు. దీనివల్ల సామాన్యుడికి ఎంత భయం కలుగుతుందీ, పర్యవసానం ఏవిటీ? అనేది మన మీడియాకి అర్ధం కాదు. ప్రభుత్వం నిబంధనలు పెట్టదు. పెడితే, ప్రెస్ సంఘాలు ఒప్పుకోవాలి.

ఇదంతా ఎందుకు రాస్తున్నానంటే, ప్రొద్దుటే, బ్రేక్ ఫాస్ట్ టేబుల్ దగ్గర కూర్చుని మా అబ్బాయికి టిఫిన్ పెడ్తూ, టీ.వీ పెట్టాను. అప్పటికి మూడురోజులుగా, వారోత్సవాల్లా రాష్ట్రంలో ఎక్కడో ఓ చోట బస్సు పడిపోయి, ప్రయాణీకులు దుర్మరణం పాలవడం చూపిస్తూనే ఉన్నారు. ఈరోజు కూడా అలవాటుగా నెల్లూరు దగ్గర బస్సు పడిపోయింది. మన కెమేరామెన్, రిపోర్టర్ అక్కడ సిద్ధం. టీ.వీ.9లో ఒక వ్యక్తి తల బద్దలై రక్తం చెంపల మీద నుండి కారిపోతుండగా, చెయ్యి కూడా ఫ్రాక్చర్ అయి ఊగుతోంది పాపం. "ఎన్నిగంటలకి ఈ ఘటన చోటు చేసుకుందీ, అప్పుడు మీరు ఏం చేస్తున్నారూ? మొదట ఏమైందీ? ఎంతమంది ప్రయాణీకులు ఉంటారు?" లాంటి ప్రశ్నలు ఆపకుండా సంధిస్తున్నాడు. అతను కూడా "నే చెప్పను పో! నన్ను అంబులెన్స్ ఎక్కించండి ముందు" అనకుండా మొహం అంతా రక్తం కారిపోతుండగా, ఓపిగ్గా జవాబులిస్తున్నాడు. నాకు గుండెల్లో ఎంతో బాధగా అనిపించింది.

సాధారణ జనం, ప్రతిరోజూ ఊళ్ళకి వెళ్ళాల్సిన ఉద్యోగాలు చేసేవాళ్ళూ, ఆప్తులు దూరాలనుండి వస్తారని ఎదురుచూసే వాళ్ళూ, బలహీన మనస్కులూ, జబ్బుతో ఉన్నవాళ్ళూ ఎంత ఎఫెక్ట్ అవుతారూ? కొంతమందికి ఆ రక్తం, శవాలూ చూస్తే గుండె ఆగిపోవచ్చుకూడా! ఎన్నివేల మంది పోయారో లెక్క తెలీని 9/11 దుర్ఘటనలోనే వాళ్ళు రక్తం, శవాలూ, చూపించకుండా మేనేజ్ చేసారు. ప్రజలు దానికే భయపడిపోయారు. ఆ షాక్ నుండి శ్వేత జాతీయులు కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. పోయిన తమ ఆప్తులు కోసం మౌనంగా కేండిల్స్ వెలిగించి ప్రార్ధనలు చేస్తున్న దృశ్యాలు మనకి చూపించారు. ఆ దేశంలో ప్రజల ప్రాణానికి విలువ ఎక్కువ.

నేను పోయినసారి 'ఆటా'కి న్యూజెర్సీ (2005) వచ్చినప్పుడు చిట్టెన్ రాజుగారు, నన్నూ, గొల్లపూడి మారుతీరావుగారినీ, వారి సతీమణినీ మన్‌హట్టన్ తీసుకెళ్ళి, మళ్ళీ పునర్నిర్మాణంలో ఉన్న వరల్డ్ ట్రేడ్ సెంటర్ని చూపించారు. అప్పుడు ఆ స్థూపాలలో పోయిన వారికి కన్నీటితో సెల్యూట్ చేస్తున్న వారి బంధువుల ఫోటోలు చూసాం. అంతేకానీ ఆ శవాల ఫోటోలు కాదు! శవాలని క్యాష్ చేసుకోవాలనీ, అవతల ఛానెల్ కన్నా ముందు మన ఛానెల్‌లో ఎక్కువ శవాలని చూపెట్టాలనీ తొందరపడే మన పాత్రికేయుల్నీ, మీడియా వాళ్ళనీ ఏం అనాలి? రక్తాలు కారిపోతూ, అవయవాల్ని పోగొట్టుకుని, కొన ఊపిరితో ఉన్నవారిని ఆసుపత్రికి తీసుకెళ్తారా? లేక కెమేరా పెట్టి, మైకు చేతికిచ్చి మాట్లాడమంటారా? వీళ్ళకి మానవత్వం లేదా? వీళ్ళ మీద ఎటువంటి కంట్రోలూ లేదా?

మూడు సంవత్సరాలకు ముందు, ఒక రోజంతా టి.వి9లో ఒకే దృశ్యం చూపించారు. ఒక అమ్మాయిని తొమ్మిది మంది మహిళలు కలిసి దారుణంగా తిడుతూ, కాళ్ళతో కుమ్ముతూ కొట్టడం, ఇది రోజంతా ప్రసారం అయిన తరువాత రాధ అనే ఆ అమ్మాయి మర్నాడు తెల్లవారు ఝామున మరణించింది. తన భర్తతో అక్రమ సంబంధం పెట్టుకున్నదన్న కారణంతో ఒక స్త్రీ తన బంధువులతో కలిసి చేసిన దాడి అది. వారు పశువుల్లా మీదపడి కొడ్తుంటే, ఇది షూట్ చెస్తున్న కెమేరామెన్, అసిస్టెంట్లు, మిగతా మీడియా ప్రతినిధులూ దారుణం ఆపకుండా, అదంతా షూట్ చేసి, ఆమె ప్రాణాలు పోవడం కూడా చూపిస్తారా? నేనూ నా రాక్షసి సినిమాలో ఇలియానా కూడా ఇదే చేసింది. రానా ఆత్మహత్య చేసుకుని పోతూ, చివరికి ప్రాణాల మీద తీపితో "నన్ను రక్షించవే.. కాల్ ద అంబులెన్స్" అంటే "అది నా పనికాదు, షూట్ చెయ్యడమే నా పని!" అంటుంది.

అది సినిమా. కానీ ఇది జీవితం. కనీసం మానవత్వం లేకుండా ఈ మీడియా ఎందుకు వ్యవహరిస్తోంది?

ఎవరో అమ్మాయిలు రెయిడింగ్‌లో పట్టుబడతారు. వీళ్ళు రోజంతా, ఐదు నిమిషాల గ్యాప్‌లో వారిని చూపిస్తుంటారు. తరువాత ఏం జరుగుతుంది? వాళ్ళు ఆర్టిస్టులు అయితే డిమాండ్ హెచ్చుతుంది. ఇదంతా మామూలే, జనం ఒక రోజులో మరిచిపోతారు అని సామాన్య యువతులకి ధైర్యం ఏర్పడ్తుంది. తారా చౌదరి.. ఈ పేరు ఛానెల్స్‌లో మార్మోగిపోయింది. కసబ్‌ని కూడా అంతగా చూపించి ఉండరు. ఆమె ఊరికెళ్ళి ఆమె ఊరి ప్రజల్నీ, ప్రత్యర్థుల్నీ కూడా ఇంటర్వ్యూ చేసుకొచ్చారు. ఆమె పాపులారిటీ పెంచేసారు.

ఒక ఛానెల్ ఎక్స్క్లూజివ్‌గా తివారీ రాజ్‌భవన్‌లో చేసిన శృంగార లీలలు రోజంతా చూపించింది.

ఒక ఛానెల్ మాత్రమే కల్కి భగవాన్ ఆశ్రమంలో భక్తులు భంగు తాగి అసభ్యంగా ప్రవర్తించడం, అక్కడ భక్తులకి డ్రగ్స్ ఇవ్వడం చూపించింది.

నిత్యానందస్వామి గురించి మనోరంజితంగా చూపిస్తారు.

ఇవన్నీ చూసినా కూడా మళ్ళీ ఎవరో రమణ బాబా అట. షిర్డీ వెళ్ళకుండానే షిర్డీ బాబాని చూపిస్తామా, తిరుపతి వెళ్ళకుండా వెంకటేశ్వరుడ్ని చూపిస్తానూ అంటే జనం ఎగబడి వేలకి వేలు పోసి టిక్కెట్లు కొన్నారు.

ఇవికాక, పంది గుడిలో ప్రదక్షిణాలు చెయ్యడం, పాము దేవుళ్ళ పటం మీద ఆడడం, తాబేళ్ళు నీళ్ళల్లో మునిగి గుడి చుట్టూ తిరగడం, పాలు తాగే దేముళ్ళూ, కోడిగుడ్డులో వినాయకుడు న్యూస్‌లుంటాయి.

ఫలానా బాబా నడుం మీద ఎగిరి ఎగిరి తంతే భక్తుల వ్యాధులు తగ్గుతున్నాయి. ఫలానా ఆవిడ ముఖం మీద ఉమ్మితే, స్త్రీలు గర్భవతులు అవుతున్నారు అని ఛానెల్స్‌లో చూపిస్తే, జనం వారిపట్ల జాగురూకతతో దూరంగా ఉండడానికి బదులు, అక్కడ భక్తిగా క్యూలు కట్టి దక్షిణ సమర్పించుకుంటున్నారు. మీడియా వల్ల కింద తరగతి వారికి డబ్బు ఎలా విచ్చలవిడిగా ఖర్చుపెట్టచ్చో, ఎన్నెన్ని చెడు అలవాట్లు మన చుట్టూ ఉన్నాయో తెలుస్తోంది. మానసిక బలహీనతలు ఉన్న వారికి క్రైం రిపోర్టింగ్‌లు ద్వారా, నేరాలు ఎలా చెయ్యచ్చో తెలుస్తోంది. శారీరక బలహీనతలు ఉన్నవారికి ఏ.బి.ఎన్ 'ఇది మల్లెల వేళయనీ' లేదా మరో ఛానెల్‌లో 'స్పందన' గాడిద గుడ్డూ ద్వారా, ఉద్రేకం కలిగి, ఇంకొన్ని ఘాతుకాలు జరుగుతున్నాయి.

నిరంతర వార్తా స్రవంతి అంటూ, రోజంతా ఈ వార్తలు, అహరహమూ తెలుసుకొనాల్సిన అవసరం ఉందా? ఈ ఛానెల్స్ రాకముందు, ఈ ప్రసారాలు లేక ప్రజలు న్యూస్ ప్రతి నిమిషం ప్రజలు తెలుసుకోక ముందు, ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు. బీ.పీ.లూ, షుగర్లూ, హార్ట్ ఎటాకులూ, పెరాల్సిస్‌లూ ఇంత రేట్‌లో ఉండి ఉండవు. ఎప్పుడైనా సినిమాకి వెళ్ళేవారు.

టీ.వీ వచ్చినా, రోజుకి రెండు సార్లు న్యూస్ చూసేవారు. లేదా తెల్లారాకా పేపర్ వచ్చేదాకా ఆరోగ్యంగా ఉండేవారు. ఈ టెలివిజన్‌తో పోటీపడడానికి ప్రెస్ మీడియా కూడా అవధులు దాటిపోయి ఫోటోలు ప్రచురించేస్తోంది. వీళ్ళకి సెన్సార్ లేదా? The great Fourth Estate ఇందుకేనా ఉన్నది.

సినిమాల్లో రక్తం, స్త్రీలని దూషించడం, కొట్టడం, తన్నడం, అశ్లీలం, అంగాంగాలు చూపించడం నిరోధించడానికే ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ ఉంది. మరి టీ.వీ.కీ, ప్రెస్‌కీ సెన్సార్ లేదా? ఉంటే ఏం చేస్తోంది? సమాజానికి మేలు చెయ్యడానికా కీడు చెయ్యడానికా ఈ ఛానెల్స్?

నేను ఈ ఆర్టికల్ రాస్తున్న టైంలో టి.వి.9లో కర్నాటకా ఎం.పీ. రాములు కుమార్తె స్వర్ణనందిని కిడ్నాప్ చేసారని బ్రేకింగ్ న్యూస్ వేస్తున్నారు. V6 అనే ఛానెల్‌లో విష్ణునందన్‌ని కిడ్నాప్ చేసారు అని చూపిస్తున్నారు. అసలు పేరు కరెక్టో కాదో కూడా తెలుసుకోకుండా అందరికన్నా మొదట ప్రసారం చెయ్యాలి అనే ఆతృత కనిపిస్తుంది. దీనివల్ల చాలాసార్లు అనర్థాలు జరుగుతాయి. షిరిడీ వెళుతున్న కాళేశ్వరా ట్రావెల్స్ బస్సు బోల్తా పడిన ఘటనలో చనిపోయిన వారి పేర్లు చాలా మటుకు తప్పే స్క్రోల్ చేసారట.

వార్తా ప్రసారాలు జనచైతన్యం కలిగించాలి, అచేతనుల్ని చెయ్యడం వారి ముఖ్యోద్దేశం కాకూడదు.

చాలావరకూ పోలిటిక్స్, సినిమాలు ఎలాగో స్కాండల్సే. కనీసం ప్రమాదాలు, దుర్ఘటనలు, నేరాలు, ప్రకటనలు ఇవైనా ఆధారాలతో నిజాలు అని ధ్రువీకరించుకుని చూపిస్తే మేలు.

ఇంక వ్యాపార ప్రకటనల విషయానికొస్తే ఇదివరకు వాషింగ్ సోప్‌లు, కాస్మొటిక్స్, చీరలు, నగలు, గృహోపకరణాలు, భీమా పాలసీలు, బ్యాంక్ లోన్‌లు ఇత్యాది ఉండేవి. కానీ ఇప్పుడు ఏ వాణిజ్య ప్రకటన చూసినా "ఈ తావీజు కట్టుకోండి మీ జాతకం మారిపోతుంది, రక్షణ రేకువల్ల చెడుదృష్టి పోతుంది, మీ మీద చాలా దిష్టి పీడ ఉంది. ఈ రుద్రాక్ష వాడండీ, ఈ యంత్రం ఇంట్లో పెట్టండీ. లేదా మీ అదృష్టరాళ్ళు ధరించండీ, మీ ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి, విద్యార్థులకి చదవక్కరలేకుండానే పరీక్షల్లో డిస్టింక్షన్ వస్తుందీ.." లాంటి మూఢనమ్మకాలు ప్రవేశపెడుతున్నారు. కొన్ని మతపరమైనవి కూడా ప్రకటనల కాలంలో స్లాట్ కొనేసుకుని బోధ చేస్తున్నారు.

మా అక్క కూతురు ఇంట్లో టీ.వీలో కుక్కరీ షోలొచ్చే ఛానెల్స్ తప్ప రాకుండా చేసింది. పిల్లలు ఏం చూసి పాడయిపోతారో అని దాని బాధ.

మా పిల్లలు ఎలా పెద్దయ్యారో నాకు ఇప్పుడు ఆశ్చర్యంగా ఉంది కానీ, ప్రస్తుతపు పరిణామాలలో పిల్లల పెంపకం గొప్ప కసరత్తు. తల్లితండ్రులకి ఒకడ్ని పెంచి పెద్ద చెయ్యడమే శక్తికి మించిన పని. ఇంట్లోనే ఉన్న ఈ 'పాండోరా బాక్స్' తెరిస్తే ఎంత భయంకరాలొస్తాయో అనే భయంతో పిల్లల్నీ, టీ.వీ.నీ ఇంట్లో వదిలి వెళ్ళడం సాహసమే.

ప్రభుత్వానికి ఎల్లప్పుడూ తను నిలబడటానికి ప్రయత్నించడంతోనే సరిపోతుంది. కనీసం సుప్రీం కోర్టు అయినా కలగచేసుకుని ఈ ప్రసార మాధ్యమాల మీద కొంత సెన్సార్, కొన్ని నిబంధనలూ విధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

Click here to share your comments on this story.


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
2007
చలన చిత్ర నంది బహుమతులు
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి